

ఆదివారం కురిసిన భారీ వర్షానికి
సూర్యాపేట జిల్లా కోదాడలో కొట్టుకుపోయిన కార్లు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని
కుర్హినిశెట్టి కాలనీలో ఇంటిలోకి చేరిన వర్షపునీరు



హుజూర్‌నగర్ పట్టణంలో మఠంపల్లి రోడ్డులో
నీట వరద నీటిలో చిక్కుకున్న లారీ

# ఎల్లంపల్లి ఎత్తిపోతలు చేపట్టండి

- సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులూ నింపాలి
- ఇరిగేషన్ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్1 (నమస్తే తెలంగాణ): ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరదనీటిని రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఎత్తిపోయాలని సీఎం రేవంత్‌రెడ్డి సాగునీటిపారుదలశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని పేర్కొన్నారు. మిడ్‌మానేరు, లోయర్ మానేరు, రంగనాయక్ సాగర్, మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్ జలాశయాల వరకు ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని సూచించారు. సింగూర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల వరకు నీటిని తరలించాలని తెలిపారు. మల్లన్నసాగర్‌లో గరిష్ఠంగా 20 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని పేర్కొన్నారు.

### ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో ఉండాలి: మంత్రి ఉత్తమ్



భారీ వర్షాల నేపథ్యంలో ఏఈల నుంచి సీఈల దాకా క్షేత్రస్థాయిలోనే ఉండి వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో రెడ్ అలర్ట్ నేపథ్యంలో నీటిపారుదల శాఖ సిబ్బందికి సెలవులు రద్దు చేసినట్టు తెలిపారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గండ్లు పడిన చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలో కోదాడ, హుజూర్‌నగర్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను సోమవారం పర్యటించనున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## 677 మందిని రక్షించిన అగ్నిమాపక శాఖ

- అత్యవసరమైతే 101కి కాల్ చేయండి: ఏడీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఎడతెరపిలేని వర్షాల కారణంగా వరదల్లో చిక్కుకున్న 677 మందిని అగ్నిమాపకశాఖ సిబ్బంది కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు ఆ శాఖ అడిషనల్ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని షిరిడీసాయి నగర్‌కు చెందిన 450 మందిని, ములుగు జిల్లాలోని కొండాయి గ్రామంలో మరో 150 మందిని సురక్షితంగా బోట్ల ద్వారా కాపాడినట్టు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరాలోని ఇందిరమ్మకాలనీలో మరో 50 మందిని, వంగవీడులో ఐదుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ సమీప గ్రామాల్లో 14 మందిని, , ఖమ్మం అర్బన్‌లో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరు, మహబూబ్‌నగర్‌లో ఐదుగురు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఐలందలో నలుగురు, మహబూబాబాద్ జిల్లా బీచురాజుపల్లిలో 9 మందిని అగ్నిమాపక శాఖ సిబ్బంది రక్షించినట్టు ఏడీజీ నాగిరెడ్డి తెలిపారు. అత్యవసరమైతే వెంటనే 101కి కాల్ చేయాలని సూచించారు.

# ఎత్తిపోతలు నడిచేదెట్లా?

- నిధులు విడుదల చేయని సర్కారు
- పూర్తికాని లిఫ్ట్ స్కీమ్‌ల ఒప్పందాలు
- పంప్‌హౌజ్‌లు నడపలేమంటున్న కాంట్రాక్టర్లు
- జీతాల కోసం రోడ్డెక్కుతున్న కార్మికులు
- రూ.40 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు

వానకాలం సీజన్ ముగిసే దశకు వచ్చింది. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, వాగుల్లో వరద ప్రవాహాలు జోరుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో పనిచేసే పంప్‌హౌజ్‌లు మాత్రం.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో నడిచే పరిస్థితి లేకుండాపోయింది. ఫలితంగా వాటి ఆయకట్టు పరిధిలోని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.



నిండు కుండలా మారిన ఎల్లంపల్లి ప్రాజెక్టు

హైదరాబాద్, సెప్టెంబర్1 (నమస్తే తెలంగాణ): సాగునీటి ఎత్తిపోతల పథకాలు ఏడాదిలో 90 నుంచి180 రోజుల వరకు మాత్రమే పనిచేస్తాయి. నీటి వనరుల్లో వరద ప్రవాహం కొనసాగిన సమయంలోనే పంప్‌హౌజ్‌లు పనిచేస్తాయి. 2021లో టెండర్ల ద్వారా ఏజెన్సీలకు పంప్‌హౌజ్‌ల నిర్వహణను ఆనాటి ప్రభుత్వం అప్పగించింది. అందులో కల్వకుర్తి, రాజీవ్‌భీమా పరిధిలో 4 చొప్పున, నెట్టెంపాడులో 3, కోయిల్‌సాగర్, అలీసాగర్, గుత్ప, చౌటుపల్లి హన్మంతరెడ్డి, దేవాదుల్లో ఒక్కోటి చొప్పున పంపింగ్ స్టేషన్ల అగ్రిమెంట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం కొత్తగా టెండర్లను పిలిచి బాధ్యతలను అప్పగిస్తేనే ఆయా పంపింగ్ స్టేషన్ల నిర్వహణ కొనసాగనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించలేదు. ఓఅండ్ఎం బిల్లులను మంజూరు చేయకపోవడంతో టెండర్లను ఎలా పిలువాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతమున్న ఏజెన్సీలతోనైనా నిర్వహిద్దామని భావిస్తే సంబంధిత కాంట్రాక్టర్లు అందుకు ససేమిరా అంటున్నారు. తొలుత పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేదంటే ఓఅండ్ఎంను నిర్వహించేది లేదని అధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో ఈ సీజన్‌లో ఆయా పంప్‌హౌజ్‌ల నుంచి నీటిని ఎత్తిపోసేదెట్లా? అని అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఓఅండ్ఎం కోసం నిధులను విడుదల చేయాలని మొరపెట్టుకుంటున్నారు.

### -వేతనాల కోసం కార్మికుల ఆందోళన

ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో ఆయా పంపింగ్ స్టేషన్ల కాంట్రాక్టర్లు తమ సిబ్బందికి 6 నెలలుగా వేతనాలను చెల్లించడంలేదు. దీంతో పంపింగ్‌స్టేషన్లలో పనిచేసే కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదంటూ గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల కార్మికులు ఇటీవల రోడ్డెక్కారు. నెలల తరబడి వేతనాలను చెల్లించి అప్పుల పాలవుతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పంపింగ్ స్టేషన్ల నిర్వహణ, మరమ్మతులకు సొంతంగా ఖర్చులు పెట్టామని చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, కార్మికులు,కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

### -పట్టించుకోని ప్రభుత్వం

గతంలో ప్రాజెక్టులు, పంప్‌హౌజ్‌ల నిర్వహణ, పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఇరిగేషన్ శాఖలో ఓఅండ్ఎం విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరమ్మతులు, అత్యవసర పనులకు ఈఎన్సీల అనుమతి లేకుండానే ఈఈ, డీఈల స్థాయిలోనే నిధులు కేటాయించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఓఅండ్ఎంపై దృష్టి సారించలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఓఅండ్ఎం కోసం రూ.145 కోట్లను కేటాయించింది. మొదటి త్రైమాసికం ముగిసినా ఇప్పటికీ రూపాయి విడుదల చేయలేదు. ఇటీవల దేవాదుల ఎత్తిపోతల పథకంలోని 15 పంపింగ్ స్టేషన్ల నిర్వహణకు రూ.45 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయినా ఒక్క రూపాయి ఆ శాఖకు విడుదల చేయలేదు. దీంతో ఆ పంపింగ్ స్టేషన్ల నిర్వహణపై ఎలా ముందుకెళ్లాలో తెలియక ఇరిగేషన్ శాఖ అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు.

**పెండింగ్ బిల్లుల వివరాలు**

| లిఫ్ట్ స్కీమ్ | పెండింగ్ బిల్లులు (కోట్లల్లో) |
|---|---|
| అలీసాగర్ | రూ.4.37 |
| గుత్ప | రూ.4.84 |
| చౌటుపల్లి హన్మంతరెడ్డి | రూ.1.18 |
| వేంపల్లి | రూ. 1.85 |
| కోయిల్‌సాగర్ | రూ.4.08 |
| నెట్టెంపాడు | రూ.4.16 |
| రాజీవ్‌భీమా-1 | రూ.3.95 |
| రాజీవ్‌భీమా -2 | రూ.3.68 |
| కల్వకుర్తి స్టేజ్ 1 | రూ.3.09 |
| కల్వకుర్తి స్టేజ్ 2 | రూ.2.84 |
| కల్వకుర్తి స్టేజ్ 3 | రూ.1.60 |



## వరదల్లో జనం.. సచివాలయానికి రాని సీఎం

- మంత్రులకు ఆదేశాలతో సరి


హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో ప్రజలు అతలాకుతలం అవుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష కార్యాచరణలో నిమగ్నం కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణ అతలాకుతలమైంది. ఒక్క ఖమ్మంలోనే ఐదుగురు మృత్యువాత పడ్డారు. గోదావరి వరద ఉధృతితో పోటెత్తుతున్నది. మున్నేరు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. వరద సహాయక చర్యల్లో ఎటువంటి లోటు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల, పంచాయతీరాజ్, హైడ్రా అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. భారీ వరదలు సంభవించినపుడు సీఎం సచివాలయం నుంచి పర్యవేక్షణ చేస్తే పరిస్థితులు మెరుగుపడవనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పొద్దున లేస్తే ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు వరదల్లో ఉంటే ప్రజల వద్దకు రాదా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రజలు తమకు తాముగా ఆదుకోవాలని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడితేనో, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తేనో ప్రభుత్వం సహాయక చర్యలు తీసుకుంటున్నది కానీ నేరుగా తనకు తానే కార్యక్షేత్రంలోకి దిగేందుకు అంత చొరవ ఎందుకు అంత ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం నేరుగా కార్యక్షేత్రంలోకి దిగితే ప్రజాపాలనలో ప్రజలకు మరింత ధైర్యం ఉండేదని చెప్తున్నారు.

## వరద సహాయక చర్యల్లో పోలీస్ శాఖ

- రంగంలోకి జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు
- వాగులు, కుంటలు, చెరువులు వద్ద పహారా
- ఎక్స్ వేదికగా పలువురికి డీజీపీ అభినందన

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్ర పోలీసుశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాలతో ఎక్కడికక్కడే సహాయక చర్యల్లో నిమగ్నమైంది. పోలీసుస్టేషన్ల పరిధిలో హోంగార్డుల నుంచి సీఐల వరకూ వరద ప్రభావిత జలాశయాల వద్ద పహారా కాస్తున్నారు. జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు భద్రతా పరిస్థితిని సమీక్షించి, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో చొరవ తీసుకుంటున్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు స్థానికుల సహకారంతో పోలీసులు ఆహారం, మంచినీటి వసతి ఏర్పాటు చూశారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని శ్రీరంగాపురం వద్ద అర్ధరాత్రి 3 బస్సుల్లో చిక్కుకున్న ప్రయాణికులను పోలీసులు రక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వ్యక్తి వాగులో కొట్టుకుపోతుండగా హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ రాములు ధైర్యంగా వెళ్లి అతన్ని రక్షించారు. జిగిత్యాల జిల్లాలోని మల్యాల-పెగ్గడపల్లి రోడ్డుకు అక్కడి పోలీసులు మరమ్మతులు చేశారు. వరంగల్ జిల్లాలో సీపీ అంబర్ కిశోర్‌ఝా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఐపీఎస్ రోహిత్ రాజు, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్, ఖమ్మం జిల్లాలో సీపీ సునీల్ దత్, సిద్దిపేట పోలీస్ కమిషనర్ బీ అనురాధ ఆయా జిల్లాల పరిధిలో వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. మహబూబ్‌బాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పోలీసుల కృషిని ఎక్స్ వేదికగా డీజీపీ జితేందర్ కొనియాడారు.





కరీంనగర్ శివారులోని ఎల్ఎండీ రిజర్వాయర్‌లో పెరిగిన నీటి మట్టం



కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

# ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

- శ్రీశైలానికి 4.96 లక్షల క్యూసెక్కులు
- సాగర్‌కు 4,83,766 క్యూసెక్కులు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఆదివారం జూరాలకు 3,80,200 క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 4.96 లక్షల క్యూసెక్కులు, నాగార్జునసాగర్‌కు 4,83,766 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 60,419 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 78 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, ఎల్లంపల్లికి 1.48 లక్షల ప్రవాహం వస్తున్నది. సింగూర్‌కు 13,076 క్యూసెక్కులు, నిజాంసాగర్‌కు 28,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో మొత్తం 25 గేట్లకు గాను 13 గేట్లు పూర్తిగా, 12 గేట్లు రెండు అడుగుల మేర ఎత్తి 40,962 క్యూసెక్కులను, పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు చెందిన 12 గేట్లు ఎత్తి లక్షా 4వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేశారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ ఉగ్రరూపం దాల్చింది. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా 28 అడుగులకు పైగా నీరు వచ్చి చేరింది. సుమారు 70 వేల క్యూసెక్కుల నీరు అలుగుమీదుగా పోతున్నది. నిర్మల్ జిల్లాలోని గడ్డెనవాగు, ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడి వాగు ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో గేట్లను ఎత్తి కిందికి నీటిని వదులుతున్నారు.

### మత్తడి దుంకిన మానేరు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు నిండటంతో దిగువకు మత్తడి దుంకుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 31 అడుగులకు గాను ఆదివారం రాత్రి వరకు పూర్తి స్థాయిలో నిండింది. కామారెడ్డి జిల్లా పాల్వంచ, సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగుల ద్వారా మానేరుకు 32 వేల క్యూసెక్కులకు పైగా భారీగా వరద వస్తున్నది. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగు నుంచి 33,805 క్యూసెక్కులు, గాయత్రీ పంప్‌హౌస్ నుంచి 6,300 క్యూసెక్కుల చొప్పున మొత్తం 40,105 క్యూసెక్కుల వదర నీరు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో మోయతుమ్మెద వాగు ఉప్పొంగుతున్నది. భారీగా వరద వస్తున్న నేపథ్యంలో నేడో, రేపో ఎల్ఎండీ నిండే అవకాశం ఉన్నది.

### జంట జలాశయాలకు ఉధృతంగా వరద


హైదరాబాద్ శివారులోని జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. ఉస్మాన్‌సాగర్‌కు శంకర్‌పల్లి, నవాబ్‌పేట, ఖానాపూర్ నుంచి వరద వస్తున్నది. ఇన్‌ఫ్లో 6,700 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. 1782.45 అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది. కాగా హిమాయత్ సాగర్‌కు అనంతగిరి మొదలుకొని వికారాబాద్, పరిగి, చేవెళ్ల, మొయినాబాద్ మీదుగా భారీగా వరద వస్తున్నది. 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా గరిష్ఠ స్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1756.60 అడుగల మేర నీరు నిల్వ ఉన్నది.

# విద్యుత్తు సంస్థలకు తీవ్ర నష్టం


- పలు సబ్ స్టేషన్లల్లో వరదనీరు, విరిగిన విద్యుత్తు స్తంభాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు పంపిణీ సంస్థలకు తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది. టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలో నాలుగు సబ్‌స్టేషన్లు నీటమునిగాయి. 419 విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. మొత్తంగా 16 సబ్‌స్టేషన్లలో, 75 చోట్ల 33 కేవీ ఫీడర్లు, 37 చోట్ల 11కేవీ ఫీడర్లలో నష్టం వాటిల్లింది. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 218 విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి.

- ఖమ్మం దానవాయిగూడెం, మధిర సబ్ స్టేషన్లలోకి వరదనీరు చేరింది. కామారెడ్డి జిల్లా బీర్కూర్ సబ్‌స్టేషన్ సైతం నీటమునిగింది.
- మహబూబాబాద్ జిల్లాలో 33/11 కేవీ తొర్రూరు డివిజన్ ఉల్లేపల్లి సబ్‌స్టేషన్ పూర్తిగా నీటమునిగింది.



- ఖమ్మం సమీపంలోని థంసలాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునిగింది.
- కామారెడ్డి జిల్లాలో అన్నారం 33 కేవీ ఫీడర్‌లోవిద్యుత్తు స్తంభం నేలకూలింది.
- భూపాలపల్లి జిల్లాలో తాడ్వాయి 33 కేవీ ఫీడర్‌పై చెట్టు విరిగిపడటంతో 16 విద్యుత్తు స్తంభాలు, కండక్టర్‌లు డ్యామేజ్ అయ్యాయి. ములుగు జిల్లా ఏటూరు నాగారం, రామకృష్ణాపూర్‌లో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయాయి.



హైదరాబాద్‌లో కూలిన కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్ గోడ

# భారీ వర్షాలతో ఏపీ అతలాకుతలం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అతలాకుతలమైంది. 14 నియోజకవర్గాల్లో 20 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. 9 మంది మరణించినట్టు అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ముంపు బారినపడిన 294 గ్రామలకు చెందిన 13,227 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. పోలీస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు 600 మందిని రక్షించాయి. బాధితులకు 25 కిలోల బియ్యం, ఒక్కో కిలో చొప్పున నిత్యావసరాలను ఇస్తున్నామని, మత్స్యకారులు, చేనేతలకు అదనంగా 50 కిలోల బియ్యం ఇస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సినీ నటుడు చిరంజీవి కోరారు.



వర్షం ధాటికి నిండా మునిగిన అమరామతి ప్రాంతం

# గ్రేటర్‌లో భారీ వర్షం

- బీహెచ్ఈఎల్‌లో అత్యధికంగా 8.53 సెంటీమీటర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వాన దంచికొట్టింది. దీంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు బీహెచ్ఈఎల్‌లో అత్యధికంగా 8.53 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మలక్‌పేటలో అత్యధికంగా 4.68 సెంటీమీటర్ల వర్షం కురిసిందని టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. గ్రేటర్‌లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వానలు తగ్గుముఖం పట్టాయి. తీరం దాటిన వాయుగుండం 24 గంటల్లో బలహీనపడి, అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నదని, దీని ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్టు అధికారులు వివరించారు. మరోవైపు, ఆదివారం ఉదయం దానకిశోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కలెక్టర్ అనుదీప్, ఇతర అధికారులు విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సహాయక చర్యలకు 610 అధికారిక బృందాలు ఫీల్డ్‌లో ఉన్నాయని దానకిశోర్ తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని సూచించారు.

### రాజధానిలో చినుకుపడితే.. చీకటే..

గ్రేటర్ హైదరాబాద్‌లో చినుకుపడితే చీకటే అన్నట్టుగా పరిస్థితి తయారైంది. వానొచ్చినా, వరదొచ్చినా అంధకారం నెలకొంటున్నది. శని, ఆదివారాల్లో చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడుతుండటంతో పలుచోట్ల విద్యుత్తు లైన్లు చెడిపోయాయి. ఆయా చెట్లను తొలగించేందుకు అర్ధరాత్రి సిబ్బంది శ్రమిస్తున్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం సహాయచర్యలకు ఆటంకం కలిగిస్తోంది.